విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

విద్యుత్ శాఖలో ఉద్యోగిపై ఫిర్యాదులు

విశాలాంధ్ర-అవనిగడ్డ : విద్యుత్ శాఖలో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ వైసిపి కార్యకర్తగా పనిచేస్తున్న అతనిపై చర్యలు తీసుకోవాలని మాజీ జడ్.పి.టి.సి కొల్లూరి వెంకటేశ్వరరావు పిర్యాదు చేశారు. ప్రభుత్వ శాఖలో ఉద్యోగం చేస్తూ వైసిపి కార్యకర్తగా షిఫ్ట్ ఆపరేటర్ గరికిపాటి రాకేష్ పనిచేస్తున్నారని, వెంటనే రాకేష్‌ను ఉద్యోగం నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఎన్నికల డిటి శ్రీనివాసరావుకు శనివారం పిర్యాదు చేశారు. ఎపిసిపిడిసిఎల్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ వైసిపి పార్టీ సోషల్ మిడియా కో ఆర్డినేటర్‌గా పనిచేస్తున్నాడని, దేశంలోనూ, రాష్ట్రంలోనూ ఎన్నికల కోడ్ నిబంధనలు ఉన్నప్పటికి ఫేస్ బుక్‌లో వికాస్ అన్న అభిమాని అనే పేరుతో ఖాతాని ప్రారంభించి మా నేత మండి బుద్ధప్రసాద్‌పై అసభ్య పదజాలంతో అనుచిత వాఖ్యలు చేస్తున్నాడని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ఆధారాలను ఫోటోలతో సహా ఎన్నికల రిటర్నింగ్ అధికారి బాల సుబ్రహ్మణ్యంకు అందచేశారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ శాఖలో పనిచేస్తూ ఎన్నికల కోడ్ సమయంలో తమ పార్టీ అధినేతపై అనుచిత వాఖ్యలు చేసిన గరికిపాటి రాకేష్‌ను వెంటనే విధుల నుండి తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ బాబావలి, మేడికొండ విజయ్, మోగావత్తు గోపి, కంచర్ల ఆనంద్, గుంటూరు వినయ్, లింగం బాబూరావు, కైతేపల్లి రాజేష్, చెన్ను బాబూరావు పలువురు పాల్గొన్నారు.

అవాంఛనీయ ఘటనలు జరిగితే చర్యలు

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు స్థానిక పోలీస్ స్టేషన్ లో శనివారం ఎస్ఐ సత్యనారాయణ మండలంలోని దళిత నాయకులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రియల్ 14వ తేదిన అంబేద్కర్ జయంతి నేపథ్యంలో ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పై అధికారుల నుండి వచ్చిన ఆదేశాల ప్రకారం అంబేద్కర్ విగ్రహాల వద్ద ఎటువంటి డీజే లకు అనుమతి లేదని, వాటిని వియోగించవద్దని వారికి తెలిపారు. అలాగే గ్రామాలలో ఎక్కడ కూడా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరిగినా ఉపేక్షించేది లేదని, అలా జరగకుండా ఎవరికి వారు స్వీయ భాధ్యత వహించాలని కోరారు.

'సిద్ధం' సభను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-గుడివాడ : ఈ నెల 14వ తేదిన గుడివాడలో ముఖ్యమంత్రి వైసిపి అధినేత జగన్‌మోహనరెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా మేమ సిద్ధం బహిరంగ సభ, రోడుషోలను విజయవంతం చేయాలని వైసిపి పట్టణాధ్యక్షుడు గొర్ల శ్రీను, రాష్ట్ర ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెండా చంద్రపాల్, జిల్లా నాయకుడు మండలి హనుమంతరావులు తెలిపారు. శనివారం స్థానిక ఏలూరు రోడ్డులోని వైసిపి ఎన్నికల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మట్లాడుతూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అధ్వర్యంలో శనివారం స్థానిక నాగవరపాడు సమీపంలోని కనదుర్గమ్మ దేవస్థానం ఎదురుగల ఖాళీ స్థలంలో మద్యాహ్ణం 3గం॥లకు జగన్‌మోహనరెడ్డి బసుయాత్రలో భాగంగా మేమంత సిధం బహిరంగ సభను నిర్వహిస్తునట్లు తెలిపారు. ఈ సభకు సుమార్ లక్షమంది పాల్గొటారన్నారు. సభ అనంతరం జగన్‌మెహనరెడ్డి బస్సు నుండి రోడు షోను పెద్ద కాలువ సెంటర్ వరకు నిర్వహించడం జరుగుందన్నారు. అనతరం పెడనలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఈ సభను వైసిపి కార్యకర్తలు, గృహసారధులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు, ఈ సమావేశంలో నాయకులు, పెయ్యిల ఆదారం, చూడుంరి శేఖర్, వీరిశెట్టి నరసింహరావు, అల్లం రామోహనరావు, అగస్తిరాజు కృష్ణామోహన్, టివి రంగరావు, తదితరులు, పాల్గొన్నారు.

కొండలమ్మ సన్నిధిలో మేడేపల్లి

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండలంని వేమవరం గ్రామములో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానమునకు దేవదాయ ధర్మదాయ శాఖ, ప్రాంతీయ సంయుక్త కమీషనరు, రాజమహేంద్రవరం శ్రీ మేడేపల్లి విజయరాజు శనివారం విచ్చేశారు. వీరికి కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, అనంతరము శ్రీ అమ్మ వారికీ పూజలు నిర్వహించినారు. అనంతరము శ్రీయుత ప్రాంతీయ సంయుక్త కమీషనరు వారిని శ్రీ అమ్మవారి యొక్క శేష వస్త్రము మరియు అమ్మవారి యొక్క చిత్రపటముతో సత్కరించి శ్రీ అమ్మవారి ప్రసాదము అందచేసియున్నారు. తరువాత శ్రీ అమ్మ వారి దేవస్థానము యొక్క రికార్డులను పరిశీలించి సిబ్బందికి ఆయన తగు సూచనలు మరియు సలహాలు చేసియున్నారు.

మహిళల అభివృద్ధి టీడీపీ ధ్యేయం : విశ్రమ

విశాలాంధ్ర-పెదపారుపూడి : మహిళల అభివృద్ధి తెలుగుదేశం పార్టీ ధ్యేయమని టిడిపి, బిజెపి, జనసేన పార్టీల పామర్రు నియోజకవర్గ అభ్యర్థి వర్ల కుమార్ రాజా సతీమణి వర్ల విశ్రమ శనివారం అన్నారు. మండలంలోని పులవర్తి గూడెంలో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంచుతూ రాబోయే ఎన్నికలలో ఎమ్మెల్యే గా పోటీ చేస్తున్న కుమార్ రాజాను ఆదరించి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా విశ్రమ మాట్లాడుతూ తల్లికి వందనం పేరుతో మీ ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ఒక్కొక్కరికి ఏడాదికి రూ 15,000 లు, దీపం పేరుతో ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సులో ప్రతి మహిళకు జిల్లా వ్యాప్తంగా ఉచిత ప్రయాణం, ఆడబిడ్డ నిధి నుండి 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ 1,500 లు తదితర సంక్షేమ పథకాలు టిడిపి అధినేత చంద్రబాబుకే సాధ్యమని విశ్రమ వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, మాజీ ఎంపీటీసీ కూచిపూడి జ్యోతి, చలసాని దివ్య, ఆరుమళ్ళ అనిత, చాట్ల పున్నమ్మ, పువ్వాడ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో, మచిలీపట్నం : ఎన్నికల విధులు కేటాయించబడిన సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. శనివారం కలెక్టరేట్లో తమ చాంబర్లో పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులతో మాట్లాడుతూ ఎన్నికల విధులు కేటాయించబడిన వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బందికి, పోలీస్ సిబ్బందికి, అత్యవసర సేవల క్రింద గుర్తించబడిన వివిధ ప్రభుత్వ శాఖలు వారి సిబ్బందికి ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఎన్నికల సంఘం కల్పించిందన్నారు. పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం వినియోగించుకునే వారు ఫారం- 12, ఫారం-12 డి ద్వారా ఈనెల 16వ తేదీలోగా ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో దరఖాస్తు దాఖలు చేయవలసి ఉంటుందని,పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే వారికి మే 2వ తేదీ నుండి 10వ తేదీ వరకు ఆయా నియోజకవర్గాల్లో ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ కొరకు వచ్చిన దరఖాస్తుల సంఖ్యను బట్టి ఎన్నికల సంఘం నిబంధనలు మేరకు పోస్టల్ బ్యాలెట్ ముద్రణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎలక్ట్రానిక్ ట్రాన్స్ మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టం ద్వారా సర్వీస్ వోటర్స్ కోసం ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించిందని,ఈవిధానంగురించి డెమోద్వారా వివరించారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి కే చంద్రశేఖర రావు, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి షాహిద్ బాబు, జెడ్పి సీఈవో ఆనందకుమార్ ఎన్నికల విభాగం సమన్వయ అధికారి దుర్గా కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా తొలివిడత రాండమైజేషన్

పకడ్బందీ ప్రణాళికతో శాస్త్రీయంగా తొలి విడత ఈవీఎం రాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో గల ఈవీఎం గోడౌన్ సందర్శించి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తొలి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పరిశీలించారు. పారదర్శక ఎన్నికల నిర్వహణలో భాగమైన ఈవీఎం ర్యాండమైజేషన్ ప్రక్రియగురించి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. రాండమైజేషన్ ప్రక్రియలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ర్యాండమైజేషన్ నిబంధనలు వివరించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ ఈవీఎం మేనేజ్మెంట్ సిస్టం ద్వారా ఆన్లైన్లో తొలి విడత ర్యాండమైజేషన్ నిర్వహించినట్లు, ఈ డేటా ఆధారంగా వివిధ అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈవీఎంలను కేటాయించినట్లు తెలిపారు. ఆయా నియోజకవర్గాలకు కేటాయించబడిన నెంబర్లు గల ఈవీఎంలను స్కానింగ్ చేసి తగిన భద్రతతో ఆయా నియోజకవర్గాలకు తీసుకువెళ్లవలసి ఉంటుందని సిబ్బందికిసూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతోపాటు డిఆర్ఓ కె. చంద్రశేఖర రావు, ఈవీఎంల నోడల్ అధికారులు డిపిఓ నాగేశ్వర నాయక్, ఏడి మార్కెటింగ్ నిత్యానందం, ఎన్నికల విభాగం సమన్వయ అధికారి దుర్గా కిషోర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

6,500 మందికి ఉపాధి

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలోని 21 గ్రామపంచాయతీలలో శనివారం 6,500 మంది కూలీలు ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. పనుల ద్వారా ఉపాధి పొందినట్లు ఏ.పీ.వో. కే లక్ష్మీరెడ్డితెలిపారు. వీరు 134 పంటబోదెలు, కాలవలలో పూడిక పనులు నిర్వహించినట్లు వివరించారు.

ఇండియా కూటమి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలి

విశాలాంధ్ర-గన్నవరం : నీతి వంతమైన రాజకీయాల కోసం కాంగ్రెస్, సీపీఐ మద్దతుతో ఇండియా కూటమి బలపరిచిన సీపీఎం అభ్యర్థి కళ్ళం వెంకటేశ్వరావు గెలుపునకు కృషి చేయాలని కూటమి నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం జరిగిన మూడు పార్టీల సమావేశంలో ముందుగా సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ... బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో రాజకీయ పరిణామాలు శరవేగంగా మారుతాయన్నారు. దేశ సంపద కార్పొరేట్ శక్తుల పరం అవుతుందన్నారు. మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం మార్చేయడం ఖాయమన్నారు. అదే జరిగితే మైనార్టీలకు, లౌకికవాదులకు, ప్రజాస్వామ్య పార్టీలకు ప్రమాదం వాటిల్లుతుందన్నారు. ఎన్డీఏ కూటమి, వైసీపీ పార్టీల ఓటమే లక్ష్యంగా పని చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వింతా సంజీవరెడ్డి మాట్లాడుతూ.. నీతివంతమైన రాజకీయాలను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం వచ్చిందన్నారు. బిజెపి స్వార్థ రాజకీయంతో ప్రత్యర్థి పార్టీల అకౌంట్లను సీజ్ చేస్తున్నారు. బ్యాంకు బాండ్ల పేరుతో లక్షల కోట్లు బీజేపీ ఖాతాలోకి చేరినా వారి ఖాతాలు ఎక్కడా సీజ్ అయిన పరిస్థితి లేదన్నారు. కుళ్ళు, కుట్రలతో దుర్మార్గపు రాజకీయాలకు ప్రధాని మోదీ తెర తీశారని మండిపడ్డారు. బీజేపీని ఓడించి ఇండియా కూటమిని అధికారంలోకి తేవాల్సిన అవసరం ఉందన్నారు. గన్నవరం నియోజకవర్గంలో సీపీఎం అభ్యర్థి కళ్ళం వెంకటేశ్వరరావు గెలుపు కోసం పాటుపడడంతోపాటు మచిలీపట్నం పార్లమెంట్‌లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. సీపీఐ జిల్లా నాయకులు పెద్దు వెంకటరత్నం మాట్లాడుతూ... ఒక మంచి అభ్యర్థిని పోటీలో పెట్టిన సీపీఎంకి అభినందనలు తెలిపారు. ఈ నియోజకవర్గంలో డబ్బున్న వ్యక్తులు పోటీ పడుతున్నారని, వారికి ధీటుగా గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయం చేసుకొని ముందుకు సాగాలన్నారు. కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, విద్యావంతులను ప్రమాణ వారీగా గుర్తించి పర్సనల్‌గా కలుసుకొని నీతివంతమైన రాజకీయం కోసం సీపీఎంకు ఓటు వేయమని చెప్పాలన్నారు. మహనీయుడు పచ్చలపల్లి సుందరయ్య మూడుసార్లు ఇక్కడ ఎమ్మెల్యేగా పనిచేశారని, ఆయన వారసుడుగా పోటీలో ఉన్న వెంకటేశ్వరరావుకు ప్రతి ఒక్కరూ మద్దతు పలకాలన్నారు. అనంతరం మూడు పార్టీల నాయకులతో సమన్వయ కమిటీ ఏర్పాటు చేశారు. ఈనెల 23వ తేదీన కళ్ళం వెంకటేశ్వరరావు నామినేషన్ వేస్తారన్నారు. ఆ తర్వాత గ్రామాల్లో ప్రచారం విస్తృతంగా చేపట్టాలన్నారు. కళ్ళం వెంకటేశ్వరరావు ను పరిచయం చేస్తూ ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో వామపక్ష నాయకులు ఎం.హరిబాబు, టి.వి లక్ష్మణస్వామి,, మల్లంపల్లి ఆంజనేయులు, అనుమోలు వెంకటేశ్వరరావు, మీరా ఖాన్, పెద్దు వాసుదేవరావు, కాట్రగడ్డ రామచంద్ర జోషి, శనగల సుబ్బారెడ్డి, మంచికంటి సాంబయ్య, విజయరావు, కాంగ్రెస్ నాయకులు కె. గణేష్ బాబు, గోవిందు నాగబాబు, సిపిఎం అభ్యర్థి కళ్ళం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లిలో ఘరానా 'చోర'గాళ్లు

- వయసు మళ్ళిన వృద్ధులే టార్గెట్
- సినిమా ఫక్కీలో కాపు కాసి వెంబడించి దొంగతనాలు
- చల్లపల్లిలో అరగంట వ్యవధిలో ఇద్దరి స్మార్ట్ ఫోన్లు చోరీ



విశాలాంధ్ర-చల్లపల్లి : చల్లపల్లిలో ఘరానా మోసగాళ్లు శనివారం ఉదయం అర్ధగంట వ్యవధిలో సినిమా ఫక్కీలో రెండు దొంగతనాలకు పాల్పడటంతో చల్లపల్లి ప్రజలు ఒక్కసారిగా ఖంగు తిన్నారు. సేకరించిన వివరాల ప్రకారం చల్లపల్లి నారాయణరావు నగర్ కు చెందిన 62 సంవత్సరాల వృద్ధుని చల్లపల్లి ఎమ్మార్వో కార్యాలయం వద్ద నుంచి నారాయణరావు నగర్ లోని ఇంటి వరకు దాదాపు కిలోమీటర్ వరకు వెంబడించిన సదరు ఘరానా దొంగలు వృద్ధుని ఇంటిముందు బైక్ పడిపోతున్నట్లుగా నటించి బాబాయ్ బండి పడిపోతుంది లేపమని కేకలు వేయటంతో సహాయం చేయడానికి వెళ్ళిన వృద్ధుని జేబులో నుంచి అతనికి తెలియకుండా ఖరీదైన స్మార్ట్ ఫోన్ దొంగలించి పరారయ్యారు. ఈ సంఘటన జరిగిన వెనువెంటనే దాదాపు అర్ధగంట సమయంలోనే చల్లపల్లి పోలీస్ స్టేషన్ పక్కనే వైశ్య బజార్లో గల మండపం పక్కన 64 సంవత్సరాలు గల మరొక వృద్ధుని వద్ద పై తరహాలోనే పడిపోతున్నట్లుగా నటించి వృద్ధుని జేబులో నుంచి ఖరీదైన స్మార్ ఫోన్ దొంగలించి పరారయ్యారు. రెండు దొంగతనాల బాధితులు పోలీసులను ఆశ్రయించగా దగ్గర్లోని సిసి టీవీ ఫుటేజ్ లను పరిశీలించిన పోలీసులు బైక్ పై ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తుల కోసం చల్లపల్లి చుట్టుపక్కల పరిసర ప్రాంతాలలో గాలింపు చర్యలు చేస్తున్నారు. నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన అవనిగడ్డ తర్వాత చల్లపల్లిలోనే ఎక్కువగా సీసీ కెమెరాలు ఉన్న దొంగతనాల బెడద ఎక్కువగానే కనిపిస్తుంది. నిఘా నేత్రాలు వెంబడిస్తున్నా యన్న భయం లేకుండా వ్యసనా లకు బానిసలైన యువకులు వృద్ధులను టార్గెట్ చేస్తూ బైక్ కింద పడిపోతుంది సహాయం అందించడానికి మోసగిస్తూ చాకచక్యంగా ఫోన్లు దొంగతనం చేస్తుండడంతో ప్రజలు ఔరా అని విస్మయ మొందుతున్నారు. చల్లపల్లి లాంటి ప్రధాన పట్టణంలోనే ఇలా చోరీలు జరుగుతున్నాయంటే మారుమూల గ్రామాల్లో ఉన్న ప్రజల పరిస్థితి ఏమవుతుందో అర్థం కాకుండా ఉంది. దొంగతనాలుకు పాల్పడుతున్న వారిపై పోలీసులు నిరంతర నిఘా ఉంచి వారి ఆటలు అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. నగదు అవసరమై ఎలాంటి పనులు చేయటానికైనా సిద్ధపడతారేమోనని ప్రజలు ఆందోళన పడుతున్నారు.

ప్రశ్నించానని తప్పుడు కేసులు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: తమ గ్రామంలో జరుగుతున్న అవినీతిని ప్రశ్నించటమే పాపంగా భావించి, విద్యావంతుడనైన తనపై అక్రమ కేసులు పెట్టి, వేధింపులకు పాల్పడ్డారని కొండపర్వకు చెందిన సామాజిక కార్యకర్త బొట్ల శివసత్యనారాయణ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు సతీమణి భువనేశ్వరికి వినతిపత్రం అందజేశారు. వెలుగు పథకం ద్వారా డ్వాక్రా మహిళలకు చెందిన సొమ్మును అక్రమమార్గంలో కాజేస్తే తాను సమాచారహక్కు చట్టం ద్వారా ఆధారాలు సేకరించి, న్యాయస్థానం దృష్టికి తెచ్చానన్నారు. కోర్టు ఆదేశాలతో ప్రభుత్వం అక్రమార్కుల నుంచి రూ.60లక్షలకు పైగా తిరిగి వసూలు చేసిందని పేర్కొన్నారు. కొండపర్వలో అధికారపార్టీ నేతలు కొండలు, గుట్టలను యథేచ్ఛగా తవ్వి గ్రావెల్‌ను విక్రయించగా, మీడియా దృష్టికి తీసుకెళ్లి, నిలువరించినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో తనపై హత్యాయత్నం చేసి, తల పగులగొట్టడమే కాక, అధికారపార్టీ కుటుంబాలకు చెందిన వాలంటీర్ల సాయంతో అక్రమంగా ఎస్సీ,ఎస్టీ, అత్యాచారయత్నం కేసులు నమోదు చేయించి జైలుకు పంపటమే కాక, రౌడీషీటు తెరచి కష్టాలపాలు చేశారని వాపోయారు. తనపై నమోదు చేసిన కేసులు తప్పుడుకేసులుగా నిర్ధారించి న్యాయస్థానం తీర్పునివ్వగా, రౌడీషీటు ఇప్పటికీ తొలగించలేదన్నారు. అతను ఎదుర్కొన్న కష్టాలతో కూడిన వినతిపత్రాన్ని సవివరంగా చదివిన ఆమె న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

సమతా సైనిక్ దళ్ సభ్యులను అడ్డుకున్న పోలీసులు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ప్రజలను మోసం చేసిన జగన్మోహన్ రెడ్డి యాత్రను అడ్డుకుంటామని సమతా సైనిక్ దళ్ విజయవాడలో ఇచ్చిన పిలుపుమేరకు పోలీసులు సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షులు పాలేటి మహేష్‌ని హౌస్ అరెస్ట్ చేశారు.పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన సమతా సైనిక్ దళ్,ఇతర సభ్యులు గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్ వద్ద మీడియా సమావేశం నిర్వహించడానికి వచ్చిన సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్రను,ఇతర సభ్యులను పట్టుకొని అరెస్టు చేశారు. మీడియాతో కూడా మాట్లాడనివ్వకుండా అరెస్టు చేసిన పోలీసులుపై సమతా సైనిక్ దళ్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ అధికారంలోకి వచ్చాక ఎస్సీ ఎస్టీలకు అమలు అవుతున్న 27 పథకాలను రద్దుచేసి సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించారన్నారు. దళితులపై దమనకాండన చేస్తూ అణిచి వేస్తున్నారని అంతే కాకుండా అమరావతి రాజధాని విచ్చన్నంపైన జగన్ సమాధానం చేప్పాలని డిమాండ్ చేశారు. వైకాపా ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెబుతామని నినాదాలు చేశారు.

శ్రీకృష్ణునికి వెండి కిరీటం బహూకరణ

విశాలాంధ్ర-పెదపారుపూడి : శ్రీకృష్ణ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రమైన పెదపారుపూడి చెరువుగట్టు సెంటర్లో మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఆ కృష్ణ భగవానునికి స్థానిక సుప్రియ కన్ఫెక్షనరీ కంపెనీ అధినేత ఎండూరి రవికుమార్ తన సతీమణి గౌరీ సునీత లు వెండి కిరీటం సుమారు 60 వేల రూపాయలు తన సొంత నిధులు వెచ్చించి బహుకరణగా శనివారం శ్రీకృష్ణ భగవానునికి అందించారు. అనంతరం శివార్చకులు లక్ష్మీనరసింహచార్యులు, సిహెచ్ రమేష్, సుబ్రహ్మణ్యేశ్వర శర్మ ,అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ పెద్దలచే మండల స్థాయిలో అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివార్చకులు లక్ష్మీనరసింహచార్యులు, సిహెచ్ రమేష్, ఎల్ సుబ్రహ్మణ్యేశ్వర శర్మ మరియు భక్తులు పాల్గొన్నారు.

జిల్లాలో ప్రథమ స్థానం

విశాలాంధ్ర-కూచిపూడి : 2022-24 విద్యా సంవత్సరానికి కృష్ణా, జిల్లాలలోని ప్రభుత్వ కళాశాలల పరిధిలో మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో ఉమ్మడి కృష్ణజిల్లాలోప్రథమ స్థానం సాధించినట్లు ఆర్ ఐ ఓ పెదపూడి రవికుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో కృష్ణాజిల్లాగతమూడు సంవత్సరాలుగా పరీక్షల ఉత్తీర్ణతాశాతంలో ప్రథమస్థానంలో నిలిచి హ్యాట్రిక్ సాధించగా మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల రెండు సంవత్సరాలుగా జిల్లాలో ప్రథమ స్థానాన్ని సాధించిందని వివరించారు. కాగాజనరల్.కోర్సులలో 91.26% ఉత్తీర్ణత సాధించిందని, గత విద్యా సంవత్సరంలో కూడా 73.2%తో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని ఆ కళాశాల ప్రధానాచార్యులు కే .ఏ. వి. ఎస్. వి .ప్రసాదశాస్త్రి పేర్కొన్నారు.ఈ ఏడాది కూడా అదే బాటలోనే పయనించడానికి విద్యా బోధనలో సహకరించి విజయం సాధించిన సహ అధ్యాపకులను అభినందించారు.

రేపటి నుండి వేటకు విరామం

విశాలాంధ్ర-అవనిగడ్డ : ఈ నెల 15 నుండి జూన్ 14 వ తేది వరకు చేపల వేటను నిషేదిస్తూ మత్స్యశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 15 నుండి రాష్ట్రంలోని సముద్రంలో చేపల వేట నిషేదిస్తూ మత్స్యశాఖ అధికారులు యాంత్రిక పడవులు, మోటార్ బోట్లు ద్వారా జరిగే అన్ని రకాల చేపల వేటను 61 రోజుల పాటు నిషేదించారన్నారు. సంతానోత్పత్తి కాలంలో తల్లి చేపలు రొయ్యలను సంరక్షించడం వాటి సంతతి పెరుగుదలను ప్రోత్సహించడం ద్వారా మత్స్య సంపదను పెంపొందించేందుకు ఈ నిషేదం విధించారన్నారు. ఈ మేరకు మత్స్యకారులు సహకరించాలని కోరారు. నిషేద ఉత్తర్వులు ఉల్లంఘించిన బోట్ల యజమానులకు రాష్ట్ర సముద్ర మత్స్య క్రమ బద్ధీకరణ చట్టాన్ని అనుసరించి శిక్ష పడుతుందన్నారు. అలాగే బోట్లు, మత్స్య సంపదను స్వాదీనం చేసుకుని జరిమానా విధిస్తారన్నారు. చేపల వేట నిషేదం సక్రమంగా అమలు అయ్యేందుకు మత్స్యశాఖ కోస్ట్ గార్డ్, కోస్టల్ సెక్యూరిటీ, పోలీసులు, న్యావీ, రెవెన్యూ అధికారులతో గస్తీ ఏర్పాటు చేస్తామని సూచించారు.

రేపు సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-అవనిగడ్డ : సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం.మరియాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేది మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షులు తుంగల సుమతీ అధ్యక్షతన మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు అన్ని శాఖల అధికారులు తగు సమాచారంతో సకాలంలో హాజరు కావాలన్నారు. సమావేశానికి గైహాజరైన అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయితీల సర్పంచ్‌లు, ఎం.పి.టి.సి సభ్యులు, పలు శాఖల అధికారులు హాజరు కావాలని ఎం.పి.డి.ఓ చెప్పారు.

మాల మహానాడుయూత్ అధ్యక్షుడిగా పవన్



విశాలాంధ్ర-పెడన: మాల మహానాడు కృష్ణాజిల్లా యూత్ ప్రెసిడెంట్ గా మద్దాల పవన్ నియమించినట్లు మాల మహానాడు జాతీయ అధ్యక్షులు నత్త యోనరాజు తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పవన్ కు నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పెనమలూరు నియోజకవర్గం పరిశీలకులు యడ్లపల్లి రామ్ సుధీర్, గూడూరు ఎంపీపీ సంఘ మధుసూదన రావు, రాబర్ట్ తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, Pedamallu Seetha Mahalakshmi (Old Name), W/o. Kotta Murali Krishna Rao, R/o. D.No. 11/191, Eluru Road, Gudivada - 521 301, Krishna Dist., A.P. I, declare that I, have changed my name As **KOTTA ANJANA DEVI** (New Name). Here after my name is known and called as **KOTTA ANJANA DEVI.**

జగన్ పాలనలోనే ప్రతి పల్లె అభివృద్ధి : జెడ్పీ ఛైర్మన్ హారిక

విశాలాంధ్ర-బంటుమిల్లి :- జగనన్న పాలనలో ప్రతి గ్రామం అభివృద్ధి చెందిందని, సంక్షేమ ఫలాలు వాడవాడలా అందుతున్నాయని కృష్ణాజిల్లా ప్రజాపరిషత్ అధ్యక్షులు ఉప్పాల హరిక రాము అన్నారు. ఎన్నికల ప్రచారంలో బాగంగా మండల పరిదిలోని కంచడం, బర్రిపాడు, ముంజులూరు గ్రామాలలో పెడన నియోజకవర్గ వైసిపి శసనసభ అభ్యర్ధి ఉప్పాల రాము ప్రజాదీవెన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రతి గడపకు వెళ్లి ఓట్లను అభ్యర్థిస్తూ ప్రచారన్ని నిర్వహించారు .ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గోన్న ఉప్పాల హరిక రాము తొలుత గ్రామంలోని బి ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించి ఎన్నికల ప్రచారన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప్పాల హరిక రాము మాట్లడుతూ నిరుపేదల ఆర్థిక స్థితిగతులను మార్చడానికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డికి సంపూర్ణ మద్దతు తెలుపుతు ఎన్నికలలో గెలిపించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వెలివెల చినబాబు ,జడ్పీటిసి మలిశెట్టి వెంకట రమణ, కంచడం సర్పంచి బండారు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రేపు సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కౌన్సిల్

విశాలాంధ్ర-విజయవాడ: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఎన్టీఆర్ జిల్లా కౌన్సిల్ సమావేశం 15వ తేదీ సోమవారం ఉదయం 11.00గంటలకు దాసరి భవన్‌లో జరుగుతుందని పార్టీ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ శనివారం తెలిపారు. ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అక్కినేని వనజ పాల్గొంటారని పేర్కొన్నారు. సభ్యులంతా సకాలంలో పాల్గొనాలని కోరారు.

రేపు సీపీఐ కృష్ణాజిల్లా విస్తృత కార్యవర్గం

కృష్ణాజిల్లా కమ్యూనిస్టు పార్టీ విస్తృత కార్యవర్గ సమావేశం 15వ తేది సోమవారం ఉదయం 10 గంటలకు జరగనుందని పార్టీ జిల్లా కార్యదర్శి టి.తాతయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మచిలీపట్నంలోని పార్టీ కార్యాలయం మోదుమూడి శ్రీహరిరావు భవనం నందు జరిగే ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో జరగనున్న పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యత కలిగి ఉందని సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

రేపు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై చర్చా గోష్ఠి

విశాలాంధ్ర-విజయవాడ: సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో 15వ తేదీ సోమవారం ఉదయం 10:30 గంటలకు విజయవాడ మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ ఆడిటోరియం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పై చర్చా గోష్ఠిని నిర్వహిస్తున్నట్లు సంస్థ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో వ్యవసాయ, పారిశ్రామిక, సేవల రంగాలలో జరుగుతున్న అభివృద్ధి పై, భవిష్యత్తు కర్తవ్యాలపై ప్రధాన వక్తలుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పూర్వ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ పీవీ రమేష్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ రాజనీతి శాస్త్ర పూర్వ ఆచార్యులు కొండవీటి చిన్నయ సూరి ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని కాంక్షించే ప్రజాస్వామ్యవాదులు, అభ్యుదయ కాముకులు ఈ చర్చా గోష్ఠిలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

ఎన్డీఏ కూటమి ఓటమే సీపీఐ లక్ష్యం

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఓటమే సీపీఐ లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ పిలుపునిచ్చారు. ఇండియా కూటమి, కాంగ్రెస్, సీపీఎం పార్టీలు బలపర్చిన విజయవాడ పశ్చిమ నియోజకవర్గ సీపీఐ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జీ.కోటేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ కృష్ణలంక చలసాని నగర్‌లోని సీపీఐ 17, 18 డివిజన్‌ల జనరల్ బాడీ సమావేశం స్థానిక సిద్ధెం కృష్ణారెడ్డి భవన్‌లో జరిగింది. 18వ డివిజన్ కార్యదర్శి అంబడిపూడి మోహన్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి దోనేపూడి శంకర్, సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు సంగంల పెరయ్య ముఖ్య ఆహ్వానితులుగా హాజరయిన ఈ సమావేశంలో శంకర్ మాట్లాడుతూ 140 కోట్లు జనాభా కలిగిన అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో కేంద్రంలో అధికారంలో ఉన్న పేద, బడుగు, బలహీన వర్గాల వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ సంపన్న వర్గాల ప్రయోజనాల కోసమే పని చేస్తున్న మతతత్వ పార్టీ అయిన బీజేపీ దానికి మద్దతు తెలిపిన పార్టీలను అధికారం నుంచి పారద్రోలేందుకు సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీలతో పాటు పలు పార్టీలు ఇండియా కూడమిగా ఏర్పడి ఎన్డీఏ కూటమి ఓటమే లక్ష్యంగా పని చేస్తున్నాయని తెలిపారు. ఈ దేశంలో మైనార్టీలను లక్ష్యంగా చేసుకుని కేంద్రంలో మళ్లీ గద్దె నెక్కేందుకు బీజేపీ దాని కూటమి అద్దదారులు తొక్కుతున్నాయాని, గత పదేళ్ల బీజేపీ పాలనలో దేశం అప్పులు పాలవ్వటంతో పాటు పేదలు మరింత పేదవారయ్యారని, సంపన్నులు మాత్రం మరింత సంపన్నులుగా ఎదిగారన్నారు. రాష్ట్రంలో అధికార పక్షంతోనూ, ప్రతి పక్షంతోనూ దోబూచులాడుతున్న మోదీ ప్రభుత్వంతో అంటకాగుతున్న వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలను ఓడించి ఇండియా కూటమిని గెలిపించాలని సూచించారు. పేదలు, మధ్య తరగతి ప్రజలు, సామాన్యులకు అండగా ఉండే కమ్యూనిస్టు పార్టీని గెలిపించాలని, వామపక్షాల పురిగడ్డ అయిన బెజవాడ నగరంలో కమ్యూనిస్టులు, దాని మిత్రపక్షాలను బలపర్చాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ 17వ డివిజన్ కార్యదర్శి సయ్యద్ సుభానీ, సీపీఐ 18వ డివిజన్ సహాయ కార్యదర్శులు కూరాకుల స్టాలిన్, గుంజా క్రాంతికుమార్, కోశాధికారులు పాశం ఆంజనేయులు, అర్జున్, 18వ డివిజన్ మహిళా సమాఖ్య గౌరవాధ్యక్షులు సంగుల విజయకుమారి, అధ్యక్ష, కార్యదర్శులు వేముల రఘూన్సీ, ప్రభ, ఏఐవైఎఫ్ డివిజన్ నాయకులు షేక్ నజీర్, మేడెబోయిన వెంగళరావు, బ్రాంచి కమిటీ సభ్యులు, పార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్ నాది... డబ్బులూ నాకే... !

- ఎస్ఐలకు తెలియకుండానే పంచాయితీలు
- రైటర్ ద్వారా రాయ'బేరాలు'
- పశ్చిమ జోన్‌లో ఒక సీఐ వింతవైఖరి
- మథనపడుతున్న ఎస్ఐలు

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: ఈ స్టేషన్ నాది... ఇక్కడ ఏ పంచాయితీ అయినా నేనే చేస్తా... డబ్బులు కూడా మొత్తం నాకే... ఇదీ విజయవాడ వెస్ట్ జోన్ పరిధిలోని ఓ సీఐ తీరు. ఆ స్టేషన్‌లో నలుగురు ఎస్ఐలు ఉన్నప్పటికీ వారి సెక్టార్లకు సంబంధించిన కేసుల పంచాయితీలను సదరు సీఐ చేస్తుండటం విశేషం. స్టేషన్‌లోని ఒక కీలక ఉద్యోగి ద్వారా రాయ'బేరాలు' సాగిస్తూ ఎస్ఐలకు కూడా తెలియకుండా సీఐ నేరుగా పంచాయతీలు చేస్తున్నాడని ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ఆ స్టేషన్‌లో ఏక్ నిరంజన్‌గా వ్యవహరిస్తున్న సీఐ తీరుపై ఎస్ఐలు లోలోన మథనపడుతున్నట్లు తెలిసింది. మరోవైపు సీఐ అండ చూసుకుని స్టేషన్‌లో కీలక ఉద్యోగి సైతం తన చేతివాటాన్ని చూపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కొద్దిరోజులుగా రెచ్చిపోతున్న వైనం...

అందరూ ఎన్నికల హడావుడిలో ఉండగా... సదరు సీఐ మాత్రం పంచాయితీలతో బిజీగా ఉన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఆ స్టేషన్ పరిధిలో ఓ గోడ కూల్చివేత విషయమై రెండు వర్గాల వారు గొడవపడి స్టేషన్‌కు వచ్చారు. ఈ విషయం సీఐ వద్దకు వెళ్లడంతో ఆయన కొంత డబ్బులు తీసుకుని కేసులు లేకుండా పంపించారు. బయటకు మాత్రం రాజీ చేసుకున్నారని చెప్పినట్లు తెలిసింది. అదేవిధంగా సదరు స్టేషన్ పరిధిలో ఉన్న రెండు గ్రౌండ్‌లలో ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేసిన నిర్వాహకుల నుంచి కూడా రూ.50వేలు చొప్పున వసూలు చేసినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇదే అదునుగా చేసుకున్న స్టేషన్‌లో కీలక ఉద్యోగి సైతం ఎగ్జిబిషన్‌లో ఆట పరికరాలు ఏర్పాటు చేసుకున్న వ్యక్తులను పిలిపించి ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు... అంటూ బెదిరించి రూ.25వేలు వరకు డిమాండ్ చేయగా.. వారు ఉన్నత స్థాయి వ్యక్తులతో చెప్పించడంతో సదరు ఉద్యోగి నోరుమూసుకున్నట్లు సమాచారం. మరోవైపు బ్యాంక్ ఆక్షన్‌కు కోర్టు ఆర్డర్ ఇవ్వడంతో ఒక ఆస్తిని సీజ్ చేసేందుకు బందోబస్తు కావాలని కోరిన ఓ బ్యాంక్ తరఫు న్యాయవాదిని సైతం స్టేషన్‌లో కీలక ఉద్యోగి రూ.10వేలు డిమాండ్ చేసినట్లు తెలిసింది. దీంతో ఆ న్యాయవాది బార్ అసోసియేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవగా, విషయం తెలుసుకున్న సీఐ స్వయంగా సదరు న్యాయవాదికి ఫోన్ చేసి బందోబస్తు ఏర్పాటు చేయించినట్లు సమాచారం. ఇలా ఒకరికి ఒకరు సహకరించుకుంటూ సీఐ, కీలక ఉద్యోగి తమకు దొరికిన మేరకు బాగానే దోచుకుంటున్నారని వెస్ట్ జోన్ పోలీస్ సర్కిల్‌లో పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది.

ఆనవాయితీకి కూడా తిలోదకాలు ఇచ్చి...

స్టేషన్ పరిధిలోని బార్లు, ఇతర కొన్ని వ్యాపార సంస్థల నుంచి ఆ స్టేషన్‌కు నెలవారీ మామూళ్లు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోందని తెలిసింది. గతంలో సీఐలుగా పనిచేసినవారు నెలవారీ వసూలు చేసిన మొత్తంలో ఆ డబ్బులు తీసుకువచ్చిన వారికి కొంత ఇచ్చేవారని, మిగిలినదానిలో సగం సీఐ, మిగిలిన సగం ఎస్ఐలు పంచుకునేవారని సమాచారం. అయితే కొద్దికాలం కిందట ఈ స్టేషన్‌లో పని చేసిన సీఐ తాను 70శాతం తీసుకుని ఎస్ఐలకు 30శాతం ఇచ్చేవారని తెలిసింది. ప్రస్తుతం ఉన్న సీఐ మాత్రం ఖర్చులు పెరిగాయని చెబుతూ ఎవరికీ పైసా ఇవ్వకుండా మొత్తం ఆయనే తీసుకుంటున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. నెలవారీ మామూళ్లలో పైసా ఇవ్వకుండా, తమ సెక్టార్ల పరిధిలో తమకు తెలియకుండా పంచాయితీలు చేసుకుంటూ సదరు సీఐ ఏకపక్షంగా వ్యవహరిస్తున్న తీరుపై ఎస్ఐలు గుర్రుగా ఉన్నట్లు తెలిసింది. ఈ వ్యవహారాల నేపథ్యంలోనే ఇటీవల సదరు సీఐని ఓ ఎస్ఐ ప్రశ్నించినట్లు కూడా సమాచారం. ఈ స్టేషన్‌లో జరిగే పంచాయితీలు, వసూళ్ల దందాపై ఉన్నతాధికారులు దృష్టి సారించి అక్రమ దందాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

మతతత్వ పార్టీలను ఓడించాలి

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: రానున్న ఎన్నికల్లో మతతత్వ పార్టీని, ఆపార్టీకి కొమ్ముకాస్తున్నవారిని ఓడించేందుకు సిద్ధం కావాలని తిరువూరు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి లాము తాంతియాకుమారి పిలుపునిచ్చారు. విస్సన్నపేటలో శనివారం కాంగ్రెస్, సీపీఎం నేతలతో కలసి మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో అభివృద్ధి కాంగ్రెస్ ద్వారానే సాధ్యమన్నారు. రాష్ట్రంలో ప్రధాన పార్టీలైన టీడీపీ బహిరంగంగా, వైసీపీ లోపాయికారీగా మోదీకి తొత్తులుగా మారారని విమర్శించారు. తిరువూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధి, ఇతర పార్టీల అభివృద్ధితో పోల్చి ప్రజలు తీర్పునివ్వాలని ఆమె కోరారు. దేశంలో అధికారంలో ఉన్న మతతత్వవాదుల కారణంగా పలు రాష్ట్రాల్లో క్రైస్తవులపై దాడులు, దళితులపై హింస పెరిగాయన్నారు. రానున్న ఎన్నికల్లో రాహుల్ ప్రధానిని చేయటం ద్వారానే లౌకికవాదాన్ని పెంపొందించుకునే అవకాశం ఉందన్నారు. షర్మిల మార్గదర్శకత్వంలో కాంగ్రెస్ పునరుజ్జీవం పొంది, ప్రజాదరణ పొందుతోందని పేర్కొన్నారు. సమావేశంలో ఆమెతోపాటు సీపీఎం నాయకులు వి.నాగరాజు, ఎం.జ్ఞానరత్నం, పి.ఏడుకొండలు, కాంగ్రెస్ నాయకులు గోళ్ల గురునాదరావు, గుడ్డల రాంబాబు, పి.శాంతభూషణం తదితరులు పాల్గొన్నారు.

మాదిగల మద్దతు టీడీపీ కే

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రాజ్యాంగబద్ధంగా ఎస్సీ,ఎస్టీలకు వచ్చే సంక్షేమ పథకాలను అమలు చేయకుండా దళితులకు తీరని అన్యాయం చేసిన వైయస్ జగన్‌ను ఈ ఎన్నికల్లో ఓడించాలని ఏపిఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ పిలుపునిచ్చారు.శనివారం సింగ్ నగర్ టిడిపి పార్టీ కార్యాలయంలో ఎ.పి.యం. ఆర్.పి.యస్. ఆధ్వర్యములో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సార్వత్రిక ఎన్నికల్లో యస్సీ సీట్లలో 15 సీట్లు మాదిగలకు కేటాయించి సమన్యాయం చేసిన చంద్రబాబుకే మాదిగల మద్దతు అని స్పష్టం చేశారు.గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న బోండా ఉమా మహేశ్వరరావు సెంట్రల్ నియోజకవర్గ ప్రజల ప్రయోజనాల కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిన వ్యక్తి అని, వైసిపి ప్రభుత్వంలో సెంట్రల్ నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడిందని, బడుగు, బలహీన వర్గాల జాతులు అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం-జనసే-బిజెపి కూటమి బలపర్చిన సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి బోండా ఉమను లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఆయన గెలుపుకోసం అన్ని వర్గాల ప్రజలు కృషి చేయాలని కోరారు. బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో రాజ్యాంగబద్ధంగా ఎస్సీ,ఎస్టీలకు వచ్చే సంక్షేమ పథకాలను అమలు చేయకుండా దళితులకు తీరని అన్యాయం చేసిన జగన్‌ను ఈ ఎన్నికల్లో ఓడించండి. రానున్న మా ప్రభుత్వంలో దళితుల సంక్షేమాన్ని సక్రమంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో కుక్కల అజయ్, మేకల కోటేశ్వరరావు, పేరుపోగు బాబురావు, నారీ మార్కు, ఆలేటి ఏసుపాదం, రోశయ్య, సోంపాక చిన్నబాబు, యర్రంశెట్టి ప్రసాద్ రెల్లి తదితరులు పాల్గొన్నారు.

ఊర్వశీ సెంటర్‌లో చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ: దివంగత సీపీఐ నాయకులు గుర్రం వెంకట నరసయ్య సార్మకార్థం ఆయన కుమారులు 36వ డివిజన్ ఊర్వశీ సెంటర్‌లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు పాల్గొని చలివేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ తండ్రి జ్ఞాపకార్థం గుర్రం ఏడుకొండలు, మనువడు గుర్రం జమలయ్య(చిన్ని) గత ఆరేళ్లుగా పేదలకు, వృద్ధులకు, మహిళలకు, బాటసారులకు నిరంతరం ఉదయం 7 నుంచి సాయంత్రం 8 గంటల వరకు సేవా భావంతో మినరల్ వాటర్ అందించటాన్ని అభినందించారు. ఈ వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతుందని వాతావరణ శాఖ తెలపటాన్ని దృష్టిలో పెట్టుకుని నగర పాలక సంస్థ అధికారులు ప్రతి సెంటర్‌లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి మంచినీటి అందించాలని కోరారు. ఈ సందర్భంగా 200 మంది ఆటో కార్మికులకు 'కాశి టవల్స్' బహూకరించారు. మొదటి రోజు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గుర్రం చిట్టమ్మ, గుర్రం వీర్రాజు, జలసూత్రం శ్రీనివాసు, స్థానిక సీపీఐ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థిని సౌమ్యకు పట్టం కట్టండి

విశాలాంధ్ర-కంచికచర్ల: నందిగామ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి తంగిరాల సౌమ్య తో పాటు విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేసినేని చిన్ని గెలిపించాలని కోరుతూ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కోగంటి బాబు ఆధ్వర్యంలో పరిటాల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఆధ్వర్యంలో గ్రామంలో ఉన్న ప్రతి ఇంటింటికి తిరిగి టిడిపి జాతీయ నాయకులు నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టినటువంటి సూపర్ సిక్స్ ప్యాక్ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించడం జరిగినది.ఈ సందర్భంగా తెదేపా నాయకు లు మాట్లాడుతూ మన రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసినటువంటి ఈ జగన్ రెడ్డిని రేపు ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించి తెలుగుదేశం బిజెపి జనసేన బలపర్చిన అభ్యర్థులను తంగిరాల సౌమ్య, కేశినేని చిన్ని లకు సైకిల్ గుర్తుపై మీ ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోగంటి బాబు, మాజీ సర్పంచ్ మాగంటి బాబు, మాగంటి అబ్బాయి, మాజీ ఎంపీపీ సభ్య రాలు పరిటాల భాగ్యలక్ష్మి, మాజీ ఎంపిటిసి సభ్యులు మాగంటి చిన్న పుల్లారావు, ఎమ్మెస్ ప్రసాద్, దామినేని భాస్కర్, నెమలిపురి గాంధీ, అత్తలూరు భూపతి, ఘనపనేని సాంబశివరావు,గోపి, డాక్టర్ వీరస్వామి,మాగంటి బాలక్రిష్ణ, పరిటాల శివకుమార్, షేక్ తారాబి, కరిముల్లా, యాకుబ్ ,జాఫర్, ఖదీర్, ఎన్ డి ఏ కూటమి కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కావాలంటే నిజం గెలవాలి : నారా భువనేశ్వరి

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: రాష్ట్రంలో ప్రజాస్వామ్యం పరిరక్షించబడాలంటే రానున్న ఎన్నికల్లో వైసీపీని ఓడించి, ప్రజలు నిజాన్ని గెలిపించాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి పిలుపునిచ్చారు. చంద్రబాబు అరెస్టుతో గుండె పోటుకు గురై మండలంలోని కొండపర్వ గ్రామంలో మూటం శ్రీనివాసరావు, బాణావతు ధనమ్మ అనే ఇరువురు మరణించగా, వారి కుటుంబాలను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజావ్యతిరేక, హింసాత్మక పాలనతో ప్రజలు తీవ్ర అవస్థలకు గురయ్యారన్నారు. విధ్వంసకర పాలన కారణంగా రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి దూరమైందని పేర్కొన్నారు. దేశంలో అభివృద్ధిలో అగ్రస్థానంలో ఉండే ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటి పరిస్థితుల్లో వ్యక్తిగత దాడులు, గంజాయి, మద్యం ప్రధాన అంశాలుగా మారటం దారుణమన్నారు. అనంతరం ఆమె విస్సన్నపేటలో ప్రజలకు అభివాదం చేసి, ఎ.కొండూరు, తిరువూరు మండలాల్లో పర్యటనకు తరలివెళ్లారు. ఆమెతోపాటు మండల టీడీపీ అధ్యక్షుడు మట్టా వేణుగోపాలరావు, విజయవాడ పార్లమెంటు, తిరువూరు అసెంబ్లీ అభ్యర్థులు కేశినేని శివనాథ్(చిన్ని), కొలికపూడి శ్రీనివాసరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కోటేశ్వరరావు, బాబూరావులను అభినందించిన దోనేపూడి

విశాలాంధ్ర-విజయవాడ: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లా కార్యాలయానికి శనివారం విచ్చేసిన ఇండియా కుటమిని బలపరచిన సీపీఎం సెంట్రల్ నియోజక వర్గ అభ్యర్థి సీహెచ్.బాబురావు. సీపీఐ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి జి.కోటేశ్వరరావులను సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అభినందించారు. మోదీకి వంత పాడుతున్న ఎన్డీయే కూటమిని, అధికార వైసీపీలను ఓడించాల్సిన అవసరం ఉందన్నారు. విజయవాడ నగరం అభివృద్ధి కమ్యూనిస్టులతో సాధ్యం అన్నారు. వామపక్షాల అభ్యర్థులు ఈ ఎన్నికల్లో విజయం సాధించి చట్ట సభల్లో ప్రజల గొంతు వినిపించాలని ఆకాంక్షించారు. ఇరుపార్టీల శ్రేణులు ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుట్టి రాయప్ప, సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీకృష్ణ, కార్యదర్శి వర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ పాల్గొన్నారు.

మోదీ, జగన్‌ను ఓడించాలి

ఇండియా ఓటమి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి తాంతియా కుమారి

విశాలాంధ్ర-తిరువూరు: స్థానిక సీపీఐ కార్యాలయంలో సీపీఐ, సీపీఎం బలపరిచినటువంటి ఇండియా కూటమి కాంగ్రెస్ అభ్యర్థి లాం తాంతియా కుమారి శనివారం సీపీఐ శ్రేణులను మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో శాసనసభ, దేశంలో పార్లమెంటు ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా సీపీఐ శ్రేణులను తిరువూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కలిశారు. దేశంలో నరేంద్ర మోడీని, రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఓడించాలని ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చాయి. త్వరలో ఎన్నికల భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తూము కృష్ణయ్య, తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి ఎస్.కే.నాగుల్‌మీరా, జిల్లా కార్యవర్గ సభ్యులు చిలుకూరు వెంకటేశ్వరరావు, తిరువూరు పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయ్, విస్సన్నపేట మండల కార్యదర్శి మర్సకట్ల త్యాగరాజు, తిరువూరు నియోజకవర్గ రైతు సంఘం నాయకులు వేగి. వెంకటేశ్వరరావు, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు ఎస్.కే.సుభాని, ఏఐటీయుసి తెలుగు నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్.కే.మీరా (కార్పెంటర్),మరియు పార్టీ శ్రేణుల సభ్యులు పాల్గొన్నారు.

40 ఏళ్ల వ్యక్తి తల భాగం నుంచి భారీ కణితి తొలగింపు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): నగరంలోని వరుణ్ కార్డియాక్ అండ్ న్యూరో సైన్సెస్ నందు అద్భుతం ఆవిష్కృతమైంది. ప్రపంచంలోనే అత్యంత అరుదైన శస్త్రచికిత్సను ప్రఖ్యాత న్యూరో సర్జన్ డాక్టర్ పువ్వాడ రామకృష్ణ విజయవంతంగా పూర్తి చేశారు. ఈ చికిత్సకు సంబంధించిన వివరాలను తెలియజేసేందుకు బెంజ్ సర్కిల్ సమీపంలోని వరుణ్ కార్డియాక్ అండ్ న్యూరో సైన్సెస్ నందు శనివారం మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో డాక్టర్ పువ్వాడ రామకృష్ణ మాట్లాడుతూ.. "గుడివాడకు చెందిన మోహన్ రామ్ (40) తల భాగంలో గడ్డతో చిన్న వయసు నుంచి బాధ పడుతున్నారు. గడ్డ వల్ల చాలా ఇబ్బందిగా ఉన్నప్పటికీ, బయటి వ్యక్తులకు తన పరిస్థితి తెలీకుండా టోపీ పెట్టుకునేవాడు. అయితే, ఈ గడ్డ క్రమక్రమంగా పెరుగుతూ అత్యంత భారీ కణితిగా తయారైంది. కణితి రోజురోజుకూ పెరిగిపోతూ, పుర్రె ఎముకలను దెబ్బతీయడంతో మెదడుపై ఒత్తిడి తీవ్రమై పేషెంట్ భరించలేనంత నొప్పి బాధపడసాగాడు. ఆ పరిస్థితుల్లో రోగి, వరుణ్ కార్డియాక్ అండ్ న్యూరో సైన్సెస్ లో సంప్రదించాడు. 18 సెంటీమీటర్ల వెడల్పు, 10 సెంటీమీటర్ల పొడవుతో ఉన్న ఈ ట్యూమర్ మరింత పెరిగిపోతోందని, ట్యూమర్ వల్ల మెదడుపై దుష్ప్రభావం ఏర్పడి ప్రాణాపాయం సంభవించవచ్చని గుర్తించాం. దాదాపు నాలుగు గంటల పాటు శ్రమించి, పుర్రె భాగాన్ని ఆపరేషన్ ద్వారా ఓపెన్ చేసి, అతి భారీ కణితిని విజయవంతంగా తొలగించాం. ఆపరేషన్ అనంతరం రోగి వేగంగా కోలుకున్నాడు. ప్రపంచంలోనే ఈ ఆపరేషన్ అత్యంత అరుదైనది. దేశంలో ఇటువంటి శస్త్రచికిత్స ఇదే మొదటిదని చెప్పుకోవచ్చన్నారు. తొలగించిన కణితిలోని భాగాన్ని బయాప్సీ పరీక్షకు పంపగా, క్యాన్సర్ కణితి కాదని తేలడం మరింత ఆనందదాయకం అని తెలిపారు. అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన డాక్టర్ పువ్వాడ రామకృష్ణ, డాక్టర్ పువ్వాడ రవితేజ, అనస్థీషియా విభాగం వైద్యులు డాక్టర్ సూర్య, డాక్టర్ దీప్తిలకు వరుణ్ కార్డియాక్ అండ్ న్యూరో సైన్సెస్ ఛైర్మన్ డాక్టర్ గుంటూరు వరుణ్ అభినందనలు తెలియజేశారు. ప్రపంచ వైద్య చరిత్రలో అద్భుతంగా పేర్కొనదగిన శస్త్రచికిత్సను తమ ఆసుపత్రిలో నిర్వహించడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు.

సామాజిక న్యాయ మహాశిల్పం ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు

విశాలాంధ్ర-విజయవాడ: స్వేచ్ఛ స్వాతంత్ర్యలకు దిశా నిర్దేశం చేసి భారత రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ భీమ్రావు రాంజీ అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా నివాళులర్పించేందుకు ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా స్వరాజ్య మైదానంలోని 125 అడుగుల ఎత్తు అంబేద్కర్ విగ్రహం ప్రాంగణంలో సందర్శకులు, సామాజికవేత్తలు, అంబేద్కర్ వాదులు ఆయనకు నివాళులు అర్పించేలా అంబేద్కర్ తాత్కాలిక విగ్రహాన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో నివాళులు అర్పించేందుకు విచ్చేసే అంబేద్కర్ అభిమానులు, సామాజిక సంఘాల నాయకులు ప్రవర్తన నియమావళిని దృష్టిలో పెట్టుకుని నివాళులు అర్పించాలని కోరారు. సామాజిక న్యాయ మహా శిల్పం పాదాల వద్దకు యిప్పటి వరకు సందర్శకులను అనుమతించ లేదని ఇదే పద్ధతిని 14 వ తేదీన కూడా కొనసాగిస్తామని ఆయన తెలిపారు. అంబేద్కర్ కు నివాళులు అర్పించేలా ప్రత్యేకమైన వసతులతో ఏర్పాటు చేశామని ఈ విషయాన్ని సందర్శకులు గమనించాలన్నారు.

కూటమి పై హెచ్ఆర్సీకి ఫిర్యాదు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఏపీలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు మానవ హక్కులకు భంగం కలిగిస్తున్నాయని వైసీపీ రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాసరావు పేర్కొన్నారు. వృద్ధులకు పింఛన్ల నిలుపుదల కోసం ఫిర్యాదులు చేసి 33 మంది ప్రాణాలు పోవడానికి ఆపార్టీలు కారణమయ్యాయని తెలిపారు. ఆయా పార్టీల పై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని న్యూఢిల్లీలోని కేంద్ర మానవ హక్కుల కమిషన్‌కు లేఖ ద్వారా ఫిర్యాదు చేసినట్లు శనివారం ఒక ప్రకనటలో పేర్కొన్నారు. రాష్ట్రంలో వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు దీర్ఘకాలిక రోగులకు ప్రతి నెల వాలంటీర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే పింఛన్ పంపిణీ వ్యవహారంలో ఏపీ ప్రభుత్వం పారదర్శకంగా జరుపుతున్నా వాటిని ఆపాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం వల్ల చాలా మంది ఇబ్బందులు పడ్డారన్నారు.ఎన్నికలు దృష్టిలో ఉంచుకుని నిమ్మగడ్డ రమేష్‌బాబు ద్వారా పిటిషన్ వేసి పింఛన్‌లు నిలుపుదల చేశారని పేర్కొన్నారు. దీంతో ఇక పింఛన్ రాదని భావించి వృద్ధులు రాష్ట్ర వ్యాప్తింగా 33 మంది మరణించారన్నారు. దీనికి కారణమైన పార్టీల పై చర్యలు తీసుకోవాలని, వాలంటీర్ వ్యవస్థను కొనసాగించాలని మానవ హక్కుల కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు.

సీఎం జగన్ బస్సుయాత్రను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-పెడన: ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదివారం పెడన నియోజకవర్గంలో నిర్వహించనున్న బస్సు యాత్ర కార్యక్రమంను విజయవంతం చేసేందుకు పెడన టౌన్ లోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పెడన పట్టణ అధ్యక్షులు బండారు మల్లికార్జునరావు, పెడన టౌన్ సచివాలయాల కన్వీనర్ మతిన్ ఖాన్ పిలుపునిచ్చారు. శనివారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, రాజీనామాలు చేసిన వాలంటీర్లు, గృహ సారుదులు పెడన పట్నంలోని 16 వార్డులో సీఎం వైఎస్ జగన్ రోడ్ షో కార్యక్రమానికి హాజరుకావాలని ఇంటింటికి ఆహ్వాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి శ్రేణులు గడపగడపకు వెళ్లి సీఎం జగన్ రోడ్ షోకు తరలిరావాలని ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ సందర్భంగా బండారు మల్లి, మతిన్ ఖాన్ మాట్లాడుతూ సీఎం జగన్ ఏప్రిల్ 14వ తేదీ అనగా ఆదివారం పెడన నియోజకవర్గంలో బస్సు యాత్ర(రోడ్ షో) నిర్వహించినట్లు తెలిపారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు తోటమూల సెంటర్లో (చౌరస్తా) సీఎం వైఎస్ జగన్ చేపట్టే రోడ్ షో కార్యక్రమానికి పట్టణంలోని 23 వార్డులు చెందిన అన్ని వర్గాల ప్రజలు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. పట్టణంలోని అన్ని వార్డుల చెందిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు మునిసిపల్ కౌన్సిలర్లు, వార్డు సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు (రాజీనామాలు చేసిన), గృహ సారధులు, వైసిపి బూత్ కోర్ కమిటీ సభ్యులు ప్రతి ఒక్కరూ తప్పకుండా హాజరై సీఎం వైఎస్ జగన్ గారి రోడ్ షో కార్యక్రమంను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ యువజన నాయకులు కటకం నాగ కుమార్, నాయకులు రహీం ఖాన్ (ఖాన్ బాబు), టైలర్ ఇలియాస్, రహేమాన్ బేగ్, లంకె పెద్ద గోవిందు, ఇషాక్, హమీద్ ఖాన్ (చోటా) రాజీనామా చేసిన వాలంటీర్లు ఆరిఫ్, మున్నా, ప్రసన్న, రేణుక, చినబాబు, షాహిన, అస్మా, దిల్షాద్, గృహసారథులు పాల్గొన్నారు.

హెలిపాడ్ నిర్మాణ పనులకు భూమి పూజ

విశాలాంధ్ర-పెడన : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు మరియు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ లు ఈనెల 17న పెడన పర్యటన ఖరారైన నేపథ్యంలో బందర్ రోడ్ లోని హెలిప్యాడ్ నిర్మాణ పనులకు తెలుగుదేశం పార్టీ నాయకులు శనివారం భూమి పూజ నిర్వహించారు.రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు మాట్లాడుతూనారా చంద్రబాబునాయుడు మరియు పవన్ కళ్యాణ్ పర్యటన సందర్భంగా పెడన పట్టణ బస్టాండ్ సెంటర్లో బహిరంగ సమావేశం జరుగుతుందని ఈ సమావేశానికి జనసేన, బిజెపి, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు భారీగా హాజరయ్యేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ ఖయ్యూం చందనారాయణరావు వాహెబ్ ఖాన్ బొడ్డు దీక్షనందుడు వెలికట్ల ప్రసాద్, పరసా జితేంద్ర, శానాపతి అజయ్,ఖదీర్, హమీదుల్లా,దాదా,మెట్ల సుబ్రమణ్యం,తదితరులు పాల్గొన్నారు

వారం కొనసాగిన అన్నసంతర్పణ

విశాలాంధ్ర-అవనిగడ్డ : జనసైనికుల ఆధ్వర్యంలో అన్నసంతర్పణ కార్యక్రమం 40 వ వారం కొనసాగింది. ఆంధ్రుల అన్నపూర్ణగా పేరొందిన డొక్కా సీతమ్మను ఆదర్శంగా తీసుకుని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు గరికిపాటి రామ్, వివేక్ మిత్ర బృందం ఆధ్వర్యంలో ప్రతి శనివారం మధ్యాహ్నం అవనిగడ్డ, కోడూరు రోడ్డులో గల పెట్రోల్ బంక్ వద్ద అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 40 వ శనివారం కరెంట్ వీరయ్య జ్ఞాపకార్థ: మనువడు చింటు అన్నదానం చేశారు. ఈ అన్నసంతర్పణ కార్యక్రమంలో 200 మందికి పైగా నిరుపేదలకు అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.టి.సిలు బొప్పన బాబు, కటికల వసంత్, మాదివాడ కుటుంబరావు లతో పాటు పలువురు జనసైనికులు పాల్గొని వారి సేవలందించారు.

ఆదర్శంగా జయంతి వేడుకలు నిర్వహించాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : బాబా సాహెబ్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఆదర్శవంతంగా గ్రామ గ్రామానా పెద్ద ఎత్తున నిర్వహించాలిన మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దోవా గోవర్ధన పిలుపునిచ్చారు. శనివారం మాల మహానాడు కార్యాలయంలో దోవా విలేకరులతో మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్ 133 వ జయంతి వేడుకలను ఆదివారం ఆయన చూపిన విధి విధానాలను అనుసరిస్తూ ఆదర్శవంతంగా నిర్వహించాలని కోరారు. తొలుత బుద్ధ వందనం పంచశిల చేసి తదుపరి కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. పీడిత వర్గాల అభివృద్ధి ఉన్నత చదువుల రాజ్యాధికారంతోనే సాధ్యం అని చెప్పిన బాబా సాహెబ్ స్ఫూర్తితో విద్యార్థుల భవిష్యత్తుకు ప్రోత్సాహాన్ని ఇవ్వడం, ఇతర ఉమ్మడి అభివృద్ధి ప్రణాళికలకు ప్రాధాన్యత ఇస్తూ, ఆత్మ గౌరవం ప్రతిబింబించేలా వేడుకలు నిర్వహించాలని దోవా కోరారు.

తెలుగుదేశం తీర్థం తీసుకున్న మండవ

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ ఏఎంసిమాజీ చైర్మన్, మొవ్వ మండలం వ్యవసాయ సలహా మండలి కమిటీ అధ్యక్షులు మండవ రత్నగిరి శనివారం సాయంత్రం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు సమక్షంలో తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. గత కొంతకాలంగా అధికార పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉన్నఆయన టీడిపి మండల మాజీ అధ్యక్షుడు మండవ శ్రీకృష్ణ తో కలిసి రేపల్లెలో మాజీ ముఖ్యమంత్రి సమక్షంలో మరికొందరితో కలిసి చేరారు. ఈ కార్యక్రమంలో పామర్రు నియోజకవర్గ ఎన్డీఏ కూటమి అభ్యర్థి వర్ల కుమార్ రాజా, మండల శాఖ అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వర రామలింగేశ్వర రావు, కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు నన్నపనేని వీరేంద్ర, పార్టీ నాయకులు తాతినేని పూర్ణచంద్రరావు, మండవ వెంకటేశ్వరరావు, ఈడే నాగేశ్వరరావు తదితరులు అధిక సంఖ్యలో హాజరైనారు.

ఐఎన్‌టీఎస్ఓలో శ్రీచైతన్య విద్యార్థులు ప్రతిభ

విశాలాంధ్ర-విజయవాడ: జాతీయ స్థాయిలో నిర్వహించే ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్(ఐఎన్‌టీఎస్ఓ) పరీక్షల్లో విజయవాడ మారుతీనగర్ శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఈజీఎం మురళీకృష్ణ విద్యార్థులను అభినందించి బహుమతులు అందించారు. ప్రథమ బహుమతి ఎస్.సహస్ర(ల్యాప్‌ట్యాప్), ద్వితీయ బహుమతి మొహమ్మద్ వాజీద్(ట్యాబ్), తృతీయ బహుమతి హిఫాషేక్(స్మార్ట్‌వాచ్) అందుకున్న వీరితో పాటు వివిధ కేటగిరీలలో సుమారు 351 మంది బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలు, ఇతర బహుమతులు అందుకున్నారు. అనంతరం మురళీకృష్ణ మాట్లాడుతూ తరగతి గదుల్లో చదువుతో పాటు పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని తద్వారా విద్యార్థులు బహుమతులు సాధిస్తున్నారని చెప్పారు. ప్రతి విద్యార్థి మొబైల్ ఫోన్, టీవీకి దూరంగా ఉంటూ విద్యార్థి దశలో కేవలం చదువుపై మాత్రమే దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజేష్, ప్రిన్సిపల్ సుజన, కోఆర్డినేటర్ అశోక్‌కుమార్, డీన్ మీనాచారి, సి.బ్యాచ్ ఇన్‌చార్జి పవన్ కోటేశ్వరరావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైలులో లోకో పైలట్ సమస్య పరిష్కారం

లోకో పైలట్‌కు అధికారులు ప్రశంసలు

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : విధినిర్వహణలో రైలు లోకో పైలట్‌లు చూపిన ధైర్యసాహసానికి ఉన్నతాధికారుల నుండి ప్రయాణీకులతో ప్రశంసలు అందుకున్నారు.రైల్వే అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం రైలు నెం. 17240 విశాఖపట్నం -గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ శనివారం రాజమండ్రికి చెందిన లోకో పైలట్‌గా ఎస్.కె. మోహన్, అసిస్టెంట్ లోకో పైలట్‌గా (ఎఎల్‌పి) జి.రజత్ కుమార్ పని చేస్తున్నారు.రైలు గొల్లప్రోలు - పిఠాపురం సెక్షన్‌లో వెళుతున్న సమయంలో ఉదయం 10.10 గం.లకు ఒక వ్యక్తి రైలు ఇంజిన్ నుండి 5వ జనరల్ కోచ్‌లోని అలారం చైన్‌ను లాగి, రైలును కిమీ 645/5 వద్ద ఆకస్మికంగా నిలిపివేశాడు. ఒత్తిడి తగ్గుదలని గుర్తించి, గార్డ్ నుండి వాకీ టాకీ ద్వారా అలారం చైన్ పుల్లింగ్ వివరాలను స్వీకరించిన తర్వాత, లోకో పైలట్ & అసిస్టెంట్ లోకో పైలట్ కోచ్ కింద ఉన్న అలారం చైన్ పుల్లింగ్ పరికరాన్ని రీసెట్ చేయవలసి ఉంది. వారు కిందకు దిగగా అలారం చైన్ పుల్లింగ్ పరికరాన్ని చేరుకోవడానికి ఒక వంతెనపై నిలిపి ఉంది. దాంతో ఆ రైలు బోగీ కిందకు వెళ్లడం తప్ప మరో మార్గం లేదు.గత్యంతరం లేకపోవటంతో అసిస్టెంట్ లోకో

పైలట్ రజత్ కుమార్ పరిస్థితిని పరిష్కరించడానికి తక్షణం స్పందించి తన ప్రాణాలు లెక్క చేయకుండా రైలు కింద నుండి ప్రాకుతూ వెళ్ళి ఎటువంటి గాయాలు కాకుండా బోగీ కింద చైన్ పుల్లింగ్ పరికరాన్ని రీసెట్ క్రాల్ చేశారు.ఎంతో నైపుణ్యం,చాకచక్యాంతో సమస్యను విజయవంతంగా సరిదిద్దారు.తిరిగి వచ్చిన తరువాత చిన్నపాటి గాయాలు కావటంతో ప్రథమ చికిత్స చేశారు.అనంతరం రైలు ఆలస్యం లేకుండా తిరిగి తన ప్రయాణాన్ని కొనసాగించడానికి అవకాశం కలిగింది.ఈ సాహసోపేతమైన చర్యలను తెలుసుకున్న డివిజన్ వ్యాప్తంగా అన్ని శాఖల అధికారులు ప్రశంసించారు.డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఎ పాటిల్ మాట్లాడుతూ రైల్వే కార్యకలాపాల భద్రత,సామర్థ్యాన్ని నిర్ధారించడంలో లోకో పైలట్‌ల కీలక పాత్రను ఈ సంఘటన నిదర్శనం అన్నారు.సింహాద్రి ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు సిబ్బంది త్వరిత ప్రతిస్పందించి ఆదర్శప్రాయంగా తమ విదినిర్వహణ పట్ల నిబద్ధతను ప్రశంసించారు.ప్రయాణీకుల భద్రత, సేవ పట్ల రైల్వే సిబ్బంది అంకితభావంతో పని చేస్తారని ఒకొక్కసారి సవాలుతో కూడిన పరిస్థితులలో కుడా తమ సిబ్బంది వృత్తి నైపుణ్యం ప్రదర్శిస్తారని కొనియాడారు. ప్రయాణీకులకు అత్యవసర పరిస్థితుల్లో తప్ప అలారం చైన్ పుల్లింగ్‌ను చేయవద్దు అని విజ్ఞప్తి చేశార. సహేతుకమైన,తగిన కారణం లేకుండా అలారం చైన్‌ను లాగడం భారతీయ రైల్వే చట్టం, 1989లోని సెక్షన్ 141 ప్రకారం శిక్షార్హమైన నేరం. జరిమానాలో ఒక సంవత్సరం వరకు జైలు శిక్ష లేదా జరిమానా ఒకొక్కసారి రెండూ విధిస్తారని తెలిపారు.

రైల్వే స్టేషన్లలో తాగునీటి లభ్యతపై ప్రత్యేక చర్యలు

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : అన్ని రైల్వేస్టేషన్లలో ప్రయాణీకులకు త్రాగునీటిని అందించడానికి దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక చర్యలు చేపట్టింది.వేసవి కాలంతో పాటు అధిక వడగాల్పుల దృష్ట్యా అన్ని స్టేషన్లలో తాగునీటి లభ్యతను నిరంతరం సమీక్షిస్తూ ప్రయాణీకులకు తగినంత త్రాగునీటి లభ్యత ఉండేలా చర్యలు చేపట్టింది. అధికారులు,సిబ్బంది బృందాలు ఏర్పాటు చేసిన నిబంధనలకు అనుగుణంగా ప్రయాణీకులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడానికి డివిజనల్ స్థాయిలలో అన్ని ఏర్పాట్లు చేసి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.ఇంజినీరింగ్,ఎలక్ట్రికల్ విభాగాల అధికారులతో సంయుక్త సమావేశాలు నిర్వహించడంతోపాటు, అన్ని స్టేషన్లలో నీటి డిమాండ్,సరఫరా సామర్థ్యాలను సమీక్షించి అవసరమైన సరఫరాను నిర్ధారించడం జరిగింది. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో అదనపు ఏర్పాట్లను కూడా చేస్తున్నారు. మండలంలోని 170 స్టేషన్లలో ఇప్పటికే 468 చల్ల నీటి కూలర్లు ఏర్పాటు చేశారు.డివిజనల్ సెంట్రల్ కంట్రోల్ ఆఫీస్ ద్వారా 24 గంటలు మానిటరింగ్ సిస్టమ్ (అన్ని స్టేషన్‌లలో నీటి లభ్యతను నిరంతరం పర్యవేక్షించడానికి) కూడా ప్రారంభించారు.ఏదైనా సమస్య తలెత్తితే కేంద్ర నియంత్రణ ద్వారా సంబంధిత సూపర్‌వైజర్‌లను వెంటనే సంప్రదిస్తున్నారు.నాణ్యమైన నీటి సరఫరాను నిర్ధారించడానికి, క్రమమైన వ్యవధిలో నీటి నాణ్యత పరీక్షలు నిర్వహిస్తున్నారు.అతి తక్కువ సమయంలో నీటి సరఫరా జరిగేలా చూసేందుకు ప్రధాన స్టేషన్లలో (ఎక్కడైనా కోచ్ వాటరింగ్ చేయాలి)ఆటోమేటిక్ వాటర్ సప్లై సిస్టమ్స్ (సి.ఎ.ఎమ్.టి.సి.ఎచ్) అందజేశారు.స్టేషన్లలో నీటి కుళాయిల పని తీరును సరిచేయడానికి సంబంధిత సూపర్‌వైజర్‌లతో బృందాలను నిరంతరం అందుబాటులో ఉంచారు. ప్రత్యేకించి ప్లాట్‌ఫారమ్‌లపై (జనరల్ కోచ్‌ల సమీపంలో ఉన్న) సమూహ నీటి లభ్యతపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.కాలువ ద్వారా నీటి సరఫరా ప్రధాన సరఫరా వనరుగా ఉన్న స్టేషన్లలో డిమాండ్‌కు అనుగుణంగా నీటి నిల్వ ట్యాంకులు పెంచారు. ఇతర ప్రదేశాలలో, అన్ని నిల్వ ట్యాంకులో (హెచ్ ఎల్& జి.యెల్.ఆర్ లు రెండూ) తగిన నీటి లభ్యతను నిర్ధారించడానికి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.స్టేషన్‌లో అవసరమైన చోట స్థానిక మునిసిపాలిటీల నుండి నీటి సరఫరా కూడా ప్రణాళికలు రూపొందించారు. భూగర్భ జలాలను పెంపొందించేందుకు మండల వ్యాప్తంగా పలు స్టేషన్లలో ఏర్పాటు చేసిన వర్షపు నీటి గుంతలను కూడా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

హిందూ మాల, క్రిస్టియన్ మాలల పరిరక్షణ సమైక్య సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి ఉత్సవాలు

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లో హిందూ మాల, క్రిస్టియన్ మాలల పరిరక్షణ సమైక్య సంఘం ఆధ్వర్యంలో డా॥బి.ఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు కర్రా గాబ్రియేలు తెలిపారు. శనివారం స్థానిక శ్రీలేఖ హోటల్ సమీపంలో అయన విలేకర్లుతో మాట్లాడుతూ 14వ తేది అంబేద్కర్ జయంతి వేడుకలు సందర్భంగా స్థానిక నెహ్రూచౌక్‌లో మజ్జిగా కేంద్రాన్ని 1టౌన్ సిఐ ఇంద్ర శ్రీనివాసరావు ప్రారంభినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు భూపతి నాగేశ్వరావు, కోరం రాజు, బొడ్డు ప్రకాష్, బొడ్డు రాంబాబు, దారం బాబి, జి. సాయి, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి ఉత్సవాలు : పొంగులేటి

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక అంబేద్కర్ భవన్‌లో జిల్లా ఆదిమాంధ్ర సంఘం ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు పొంగులేటి జయరాజు మాట్లాడుతూ ఈ నెల 14న జరిగే అంబేద్కర్ 133 జయంతిని పురస్కరించుకని పలు కార్యాక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని అంబేద్కర్ భవనంలో ఉదయం 10గం॥30లకు అంబేద్కర్ చిత్రపటానికి నివాళ్ళు అర్పించి, సమావేశాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ఉండంవల్ల ఎవరు ర్యాలీ నిర్వహించకుడదన్నారు. పట్టణంలోని అన్ని వార్డులో అంబేద్కర్ విగ్రహల వద్ద నివాళ్ళు అర్పించి అనతరం అంబేద్కర్ భవనం వద్దకు రావలని తెలిపారు. ఈ సమావేశంలో సంఘ సభ్యులు వలభపురం బుజ్జిబాబు, దళిత నాయకులు దారం కరుణాకర్, దారం ఉంపేంద్ర, దోనే కోటిబాబు, మందపాడు యువత నాయకులు, పాల్గొన్నారు.

భారత మహిళా మండలి అధ్యక్షురాలిగా శ్రీలక్ష్మీదేవి

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : భారత మహిళా మండలి నూతన కమిటీ అధ్యక్షురాలిగా రుత్తా శ్రీ లక్ష్మీదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు గత కమిటీ పదవీకాలం మార్చి నెలతో ముగియగా 2024 - 2026 సంవత్సరాలకు నూతన పాలకవర్గాన్ని మహిళా మండలి సమావేశంలో ఎన్నుకోవడం జరిగింది. ఉపాధ్యక్షురాలుగా తాడువాయి శశిరేఖ, కార్యదర్శిగా వి సూర్యకామేశ్వరి, కోశాధికారిగా కె శచిదేవి, సహాయ కార్యదర్శిగా ఆర్ ఉషామాధవి, సభ్యులుగా జి వి ఎల్ ఆర్ కుమారి, పి దివ్యవాణి, టి వసంత కుమారి లు ఎన్నికయ్యారు. ఇమీడియట్ ఫాస్ట్ ప్రెసిడెంట్ గా వి ఉమాదేవి, ఎడ్వైజరి సభ్యురాండ్రుగా ఎ రత్నలక్ష్మి, టి సాయిలక్ష్మిలు వ్యవహరిస్తారని రుత్తా శ్రీలక్ష్మీదేవి తెలిపారు.

రబీ ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర- నందిగామ: నందిగామ మండల తెలుగుదేశం పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు వీరాస్వామి ఆధ్వర్యంలో రైతుల తో కలిసి నందిగామ రెవెన్యూ కార్యాలయం ముందు నిరసన తెలియజేసి తాసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు.అనంతరం గాంధీ విగ్రహం ముందు నిరసన తెలియజేసి ధాన్యం కొనుగోలు పై ప్రభుత్వం విడుదల చేసిన రహస్య జీవోను రద్దు చేయాలని కోరుతూ గాంధీజీ కి వినతి పత్రం సమర్పించడమైనది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల రైతుల పరిస్థితి అగమ్య గోచరం గా తయారయిందనీ,ప్రభుత్వం పంట వేసిన తరువాత ఈక్రాప్ నమోదు చేసి ఇప్పుడు అధికారులు జీవో కాపీలు చూపించి ధాన్యం కొనుగోలు మా బాధ్యత కాదు అని చెప్తుంటే అన్నం పెట్టే రైతన్ననే ఇంతటి మోసం చేస్తుందా ఈ ప్రభుత్వం అనీవిచారణ వ్యక్తం చేశారు.ఇప్పుడు ప్రభుత్వ పెద్దలు నాగార్జునసాగర్,శ్రీశైలం, ప్రకాశం బ్యారేజీల్లో నీళ్లు లేవు కాబట్టి రైతులు పంటలు వేయవద్దంటూ నవంబర్ నెలలో క్యాబినెట్ సమావేశమైనట్టు ఆ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్టు మార్చి నెలలో జీవో విడుదల చేయటం అంటే ఈ ప్రభుత్వం రైతులను ఎంతగా మోసం చేస్తుందో ఈ జీవోలను బట్టి అర్థమవుతుందనీ ఒకపక్క క్రాప్ హాలిడే అంటూ రహస్యంగా జీవోలు విడుదల చేస్తూ మరొక పక్క గ్రామాల్లో అధికారులు ఈక్రాప్ ఆన్లైన్లో నమోదు చేశారు.ఈ విధానం చూస్తుంటే అధికారులకు ప్రభుత్వానికి మధ్య ఎంత సాన్నిహిత్యం ఉందో తేట తెల్లమవుతుంది.ప్రభుత్వం ఇప్పటికైనా మొండి వైఖరి విడనాడి ఇప్పటికైనా రైతులు పండించిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి.లేదంటే రైతుల ఉసురు కొట్టుకొని మట్టి కొట్టుకు పోతుంది ఈ ప్రభుత్వం రైతులు ఎండనక వాననక రేయ్ అనకా పగలనకా ఎన్నో కష్ట నష్టాలకు ఓర్చి మోటర్లు పెట్టి బోర్లు వేసి ఎంతో పెట్టుబడి పెట్టి పంట పండిస్తే రైతుల పట్ల ఈ ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణం.ఈ దారుణ పరిస్థితులు తొందర్లోనే తొలగిపోయి రైతు ప్రభుత్వం రాబోతుందని రైతులు ఈ నెల రోజులపాటు ధైర్యంగా ఓర్పుగా ఉండాలి.ఈ కార్యక్రమంలో నందిగామ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరంకి వీరస్వామన్,ప్రధాన కార్యదర్శి తోట నాగమల్లేశ్వరరావు(బుజ్జి), బత్తిన రవి, ఉమ్మినేని విక్రమ్,గర్మిడి సురేష్, మన్నేపల్లి వినయ్ కుమార్,చెరుకూరు హైమారావు, వేల్పుల బిక్షాలు, పల్లెపోగు ప్రభుదాస్, చెరుకుమల్లి శేషగిరిరావు, వీరభద్రరావు, షేక్ బుడే సాహెబ్, మద్దినేని వెంకటేశ్వరరావు, గుండెపోగు శ్రీనివాస రావు, తాళ్లూరి చిన నరసింహారావు, కొప్పుల మృత్యుంజయరావు,చెరుకుమల్లి రమేష్, సబ్బినేని రామబ్రహ్మం,చెరుకుమల్లి చంద్రశేఖర్, తదితర రైతులు పాల్గొన్నారు.

పీఓ, ఏపీవోలు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్

ఎన్నికల నిర్వహణలో అత్యంత ముఖ్యమైన పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించడంలో ప్రిసైడింగ్ అధికారులు (పీవో), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీవో) కీలకమని.. మాస్టర్ ట్రైనర్లు ఇచ్చే శిక్షణను పీవోలు, ఏపీవోలు సద్వినియోగం చేసుకొని, సమర్థవంతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ ఎస్.డిల్లీరావు సూచించారు. శనివారం నగరంలోని పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కళాశాలలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి పీవో, ఏపీవోల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పోలింగ్ రోజుకు ముందు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ దగ్గర నుంచి తిరిగి పోలింగ్ పూర్తిచేసుకుని రిసెప్షన్ సెంటర్ వరకు అన్ని అంశాలపైనా క్షుణ్నంగా అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. శని, ఆదివారాల్లో ఇచ్చే శిక్షణను పూర్తిస్థాయిలో ఉపయోగించుకుని, ఏ సందేహమున్నా మాస్టర్ ట్రైనర్ ద్వారా నివృత్తి చేసుకోవాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఆర్‌వో కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

1,216 ఫిర్యాదుల పరిష్కారం

జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఓటర్ హెల్ప్‌లైన్, నేషనల్ గ్రీవెన్స్ సర్వీసెస్ పోర్టల్ (ఎన్‌జీఎస్‌పీ) తదితర మార్గాల ద్వారా 1,250 ఫిర్యాదులు రాగా 1,216 ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియ పూర్తయిందని, మిగిలినవి పురోగతిలో ఉన్నాయని కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. ఓటరు హెల్ప్‌లైన్ (1950) ద్వారా 195 ఫిర్యాదులు రాగా 195 ఫిర్యాదుల పరిష్కారం పూర్తయిందన్నారు. సీ-విజిల్ యాప్ ద్వారా 490 ఫిర్యాదులు రాగా 487 ఫిర్యాదులను క్షుణ్నంగా పరిశీలించి పరిష్కరించినట్లు వెల్లడించారు. 62 ప్రతికూల వార్తలకు సంబంధించి 56 అంశాలను పరిష్కరించినట్లు తెలిపారు. ప్రతి ఫిర్యాదుపైనా ప్రత్యేకంగా దృష్టిసారించి నాణ్యతతో పరిష్కరిస్తున్నట్లు కలెక్టర్ డిల్లీరావు తెలిపారు.

దోష రహితంగా ఈవీఎంల కేటాయింపు ప్రక్రియ:

తొలి విడత ర్యాండమైజేషన్ ద్వారా పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈవీఎంల కేటాయింపు ప్రక్రియ సజావుగా, దోష రహితంగా జరిగినట్లు కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన ర్యాండమైజేషన్ ప్రక్రియ ఆధారంగా గొల్లపూడి ఈవీఎం గోదాము వద్ద పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈవీఎంల కేటాయింపు ప్రక్రియ శనివారం కూడా ఇది కొనసాగింది. జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్, విజయవాడ మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులతో కలిసి కార్యక్రమాన్ని కలెక్టర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ ర్యాండమైజేషన్‌లో నియోజకవర్గాలకు అనుసంధానమైన ఈవీఎంలను వేరుచేసి, ప్రత్యేక నంబరింగ్ ఇవ్వడం, స్కానింగ్ చేయడం, బాక్సింగ్, తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ లకు ట్రాన్స్‌పోర్టింగ్.. ఇలా ప్రతిదశలోనూ అప్రమత్తంగా వ్యవహరించినట్లు తెలిపారు. మొత్తం 1,781 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 20 శాతం రిజర్వ్‌తో కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్లు అందించడం జరుగుతోందన్నారు. అదే విధంగా 30 శాతం రిజర్వ్‌తో వీవీప్యాట్‌లను అందుబాటులో ఉంచనున్నట్లు వివరించారు. వేసవి నేపథ్యంలో హమాలీల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, విజయవాడ ఆర్‌డీవో, విజయవాడ తూర్పు నియోజకవర్గ ఆర్‌వో బీహెచ్ భవానీ శంకర్, కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఆర్‌వో కిరణ్మయి, తిరువూరు ఆర్‌డీవో కె.మాధవి, నందిగామ ఆర్‌డీవో ఎ.రవీంద్రరావు, జగ్గయ్యపేట ఆర్‌వో జి.వెంకటేశ్వర్లు, ఈవీఎం నోడల్ అధికారి జి.మహేశ్వరరావు, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.